

చలో విజయవాడను విజయవంతం చేయండి


చలో విజయవాడ గోడపత్రికలు విడుదల చేస్తున్న ఇంతియాజ్

పరిగి : లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం ఈ నెల 15వ తేదీ సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక భీరలింగేశ్వరస్వామి ఆలయం వద్ద 'చలో విజయ వాడ' గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, హిందూపురం పట్టణ నాయకుడు రాము, సిపిఎం మండల కార్యదర్శి లింగారెడ్డి పాల్గొన్నారు.

ఫలించిన పోరాటం..!

- పేదల పక్షాన హైకోర్టు తీర్పు
- ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ అధికారులకు ఆదేశం
- కోర్టు తీర్పుపై సిపిఎం హర్షం
- పెనుకొండలో పునాదులు తీసి నిర్మాణపనులు చేపట్టిన పేదలు


ఎదల భూ నివాస స్థలం వద్ద మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

పేదల అలుపెరగని పోరాటం ఫలించింది. పెనుకొండ పట్టణంలో ఇళ్ల స్థలం కోసం సాగించిన న్యాయపోరాటంలో వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. హైకోర్టు వారి న్యాయమైన సమస్యను గుర్తించి పేదలకు ఇళ్లు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దీంతో పేదలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీన నివాస స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు పునాదులు తీసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు హాజరయ్యారు.


ఇళ్ల పట్టాల కోసం ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలు స్థలాల కోసం గత ఆరు నెలలుగా సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో భూ స్వాధీన ఉద్యమం నిర్వహిస్తున్నారు. పెనుకొండ పట్టణ సమీపంలోని మడకశిర రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నారు. అయితే రెవెనూ అధికారులు పోలీసుల సాయంతో గత నెల రోజుల క్రితం పేదలు వేసుకున్న గుడిసెలను జెసిబిలో కూల్చిపడేశారు. అక్కడున్న పేదలను బలవంతంగా బయటకు గెంటేశారు. దీంతో వారంతా సిపిఎం ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలంటూ అక్టోబర్ 15వ తేదీన వాజ్యం వేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు అక్టోబర్ 30వ తేదీన తీర్పు వెలువరించింది. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న పేదలకు అక్కడ పట్టాలు ఇవ్వాలని, ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చేంత వరకు వారిని అక్కడి నుంచి ఖాళీ చేయొచ్చొదంటూ తీర్పు వెలువరించింది. హైకోర్టు తీర్పుపై పేదలు హర్షం వ్యక్తం చేశారు.

20వ తేదీలోపు పట్టాలు ఇవ్వాలి
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో పేదలకు ఈ నెల 20వ తేదీ లోపు వారి నివాసం ఉన్న ప్రాంతంలో పట్టాలు ఇవ్వాలని లేకుంటే అక్కడే తామే ఇళ్ల నిర్మాణాలు చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడ వెంకటేశ్వర్లు తెలియజేశారు. శుక్రవారం ఉదయం పేదలతో కలిసి పెనుకొండ భూస్వాధీన నివాస స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు పునాదులు తీసి పనులను ప్రారంభించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నా పేదలకు సొంతిళ్లు నిర్మించి ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. పెనుకొండ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ ఇళ్ల స్థలాల కోసం పేదల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా పట్టాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు కూడా పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికారులపై నమ్మకం కోల్పోయిన పేదలు గత్యంతరం లేక పెనుకొండ పట్టణం మడకశిర రోడ్డులోని ప్రభుత్వ భూమిలో భూస్వాధీన ఉద్యమం నిర్వహించారన్నారు. ఆరు నెలల క్రితం ఒక్కొక్కరూ రూ.10 నుంచి రూ.20 వేలు ఖర్చు చేసి ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్నారన్నారు. ఈ గుడిసెలను అధికారులు పోలీసులతో కలిసి రాత్రిపూట జెసిబిలతో కూల్చివేశారన్నారు. గుడిసెలకు నిప్పుకూడా పెట్టికాల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు అండగా ఉన్న సిపిఎం నాయకులను అరెస్ట్ చేశారన్నారు. అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. న్యాయం చేయాలని కోరుతూ పేదలు సిపిఎం అండతో హైకోర్టును ఆశ్రయించడంతో స్పందించిన హైకోర్టు పేదల పక్షాన తీర్పు ఇచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు హైకోర్టు తీర్పును గౌరవించి ఈ నెల 20వ తేదీ లోపు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే 21వ తేదీ తర్వాత పేదలు నివాసం ఉన్న స్థలాల్లో పక్క ఇళ్ల నిర్మాణ పనులు తామే ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సోమందేపల్లి సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, సిపిఎం నాయకులు తిప్పన్న, కిష్టప్ప , ఉత్తప్ప , నరసింహులు పేదలు పాల్గొన్నారు.

టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించేరా....?

ప్రజాశక్తి-కదిరి టౌన్

దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటులో వ్యాపారులు నిమగ్నం అయ్యారు. అయితే ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా అధికార హస్తంతో వ్యాపారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి వ్యాపారులు నిర్వహించేలా పరిస్థితులు కన్పిస్తున్నాయి. కదిరి పట్టణంలో వ్యాపారస్తులు నిబంధనలను పక్కకు పెట్టేసి విక్రయాలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జనసంచారం ఉండే ప్రాంతాల్లో టపాసుల దుకాణం ఏర్పాటు చేయకూడదన్న నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. అయినప్పటికీ నిబంధనలు తుంగలో తొక్కి జనావాసంలోనే విక్రయాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొంతమంది వ్యాపారస్తులు అధికారికంగా ఒక దుకాణంకు అనుమతి తీసుకుని రెండు అంతకంటే ఎక్కువ దుకాణాల్లో విక్రయాలు చేస్తుంటారు. ఇది ప్రతి ఏడాదీ ఇలానే జరుగుతూ ఉంటుంది. వ్యాపారస్తులు లక్షల్లో విలువ చేసే బాణసంచా సరుకులు కొన్నా కేవలం వేళల్లో కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపిస్తారు. కేవలం 10 శాతం సరుకులు చూపి సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుంటూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తారు. పెద్ద మొత్తంలో పన్నులను ఎగవేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గతేడాది కదిరి పట్టణంలో బాణసంచా దుకాణం వద్ద వ్యాపారులు రాత్రి వేళలో మద్యం సేవిస్తూ, సిగరెట్లు తాగుతు పోలీసులకు పట్టుబట్టారు. అప్పట్లో ఈ విషయం పెద్ద చర్చనీయాంశం అయ్యింది.


కదిరిలో ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ కేంద్రాలు

అధికారులకు విలువైన బహుమతులు..?

బాణసంచా వ్యాపారస్తులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నా ఆయా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులకు వ్యాపారులు విలువైన బహుమతులు అందించి వారిని నోరుమెదపకుండా చేస్తున్నట్లు సమాచారం. అధికారులు మొక్కుబడి తనిఖీలు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ఇక టపాసుల విక్రయాలు లాభసాటిగా ఉండడంతో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇందులో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నిబంధనలను పక్కకు పెట్టే వారే దగ్గరుండి వ్యాపారాలు చేయిస్తున్నారు.

నిబంధనలు ఇవి...

టపాసుల విక్రయాలకు ప్రభుత్వం కొన్ని నిబంధనలను అమలు చేస్తోంది. షాప్‌కు షాప్‌కు మధ్య దూరం కనీసం మూడు మీటర్లు ఉండాలి. బాణసంచా దుకాణాలు వద్ద ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా ముందు జాగ్రత్తగా బకెట్లో ఇసుక, నీరు నిలువ ఉంచాలి. ఆక్సిజన్ సిలిండర్ అందుబాటులో ఉంచాలి. జనసంచారానికి దూరంగా బహిరంగ ప్రదేశాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. దుకాణాల వద్ద తప్పనిసరిగా ధరల పట్టికను ఏర్పాటు చేయాలి.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

కదిరి పట్టణంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. దుకాణాల వద్దకు 18 సంవత్సరాల లోపు పిల్లలను అనుమతించరాదు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెళ్లడానికి ఆరు మీటర్లు దారి వదలాలి. దుకాణాల వద్ద ఫైర్‌ఇంజిన్ ఏర్పాటు చేస్తే దుకాణదారులు తప్పనిసరిగా చలానా కట్టాలి. టపాసుల విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే తగు చర్యలు తీసుకుంటాం.

యు.మన్సూర్, ఫైర్‌స్టేషన్ ఆఫీసర్, కదిరి.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ చేయడమే లక్ష్యం


జగనన్న కిట్‌లను అందిస్తున్న ఇన్‌ఛార్జి దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

ఆరోగ్యాంధ్రప్రదేశ్ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి తెలిపారు. పట్టణంలోని 4వ వార్డు లక్ష్మిపురం పట్టణ ఆరోగ్య ఉపకేంద్రంలో జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డితో కలిసి దీపిక వేణురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందన్నారు. జగన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇళ్ల వద్దనే వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు రీహాన దాదు, షాజియా, రహమత్‌బి, మల్లికార్జున, రోషన్ ఆలీ, లక్ష్మీ మహేష్ గౌడ్, జెసిఎస్ కన్వీనర్ శివ శంకర్ రెడ్డి, ఎబ్లాక్ కన్వీనర్ సిఎం.సాదిక్, వార్డు ఇన్‌ఛార్జులు ఫరూక్, డిష్ చాంద్ బాషా, నాయకులు నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, సుభాష్ గాంధీ, భానుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

బ్రిడ్జి ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-చిలమత్తూరు

లాలేపల్లి గ్రామం నుంచి 44వ జాతీయ రహదారికి వెళ్లే దారిలో అడ్డుగా ఉన్న కుషావతి నదిపై బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.1.18కోట్లు ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు పిఆర్ ఏఈ జమల్ బాషా తెలిపారు. వైసిపి సీనియర్ నాయకులు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేసి శుక్రవారం నాడు బ్రిడ్జ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. కొద్ది రోజుల క్రితం లాలేపల్లి నుంచి 44వ జాతీయ రహదారికి లింక్ రోడ్డును కోటి రూపాయల ఎంపీ నిధులతో వేశారు. బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు మరోసారి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేసిన ఎంపీ గోరంట్ల మాధవ్‌కు లాలేపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల ఆర్థిక స్థితి మెరుగు

ప్రజాశక్తి-చిలమత్తూరు

రాష్ట్రంలో వైసిపి అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వార పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితి మెరుగు పడిందని ఎంపిపి పురుషోత్తమ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని చిలమత్తూరు సచివాలయం-1 వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి- కనగానపల్లి

మండల పరిధిలోని కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. ఇందులో సుమారు 330 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల, చల్లాపల్లి, చాలకూరు ప్రభుత్వ పాఠశాలలు, విజ్ఞాన్, క్రీస్తు జ్యోతి ప్రయివేటు పాఠశాలల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు సైన్సుపట్ల అవగాహన పెంచుకోవాలని జెవివి నాయకులు సూచించారు.

గ్రామ స్వరాజ్యం సాకారం
ఎమ్మెల్యే శంకర నారాయణ


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-రొద్దం

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని పెనుగొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ తెలిపారు. మండల కేంద్రం నూతనంగా నిర్మించిన రొద్దం1,2,3 గ్రామ సచివాలయ భవనాలను శుక్రవారం ప్రారంభించారు. సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లకు సూచించారు. ఆర్.మరువపల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్న వైసిపి కార్యకర్త రామాంజినప్పను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతచారి, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, ఏవో నివేదిత, ఈవోఆర్డీ కేశవరెడ్డి, పంచాయితీ కార్యదర్శులు సురేష్‌బాబు, లక్ష్మీనారాయణ, జగదీష్, ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచి రూప, స్వచ్ఛ ఆంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, పెనుకొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కలిపి శ్రీనివాసులు, కన్వీనర్ బోయ తిమ్మయ్య, జెట్టి మారుతిరెడ్డి, రాజగోపాలరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి ఆర్‌ఏ.రవిశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్లు లక్ష్మీ నారాయణరెడ్డి, కెపి.శీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించు కుని జాతీయ విద్యా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగి చైతన్యవంతంతో సమాజంలోని సమస్యలను ప్రశ్నించినవారే నిజమైన విద్యావంతులు అవుతారని సూచించారు. చరిత్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని బాధ్యతాయుత పౌరునిగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ యశోద రాణి ఎన్ఎస్ఎస్ పిఒలు రంగనాయకులు, కాంతారావు, అధ్యాపకులు రామన్న, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకపోతే ఆందోళనలు

మండల సమావేశంలో ఎంపిటిసి షమీంతాజ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామికవాడలో రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ఆక్రమణలను ఆర్‌అండ్‌బి అధికారులు తొలగించక పోతే అదే రోడ్డుపై బైఠాయించి ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి ఉంటుందని ఆ ప్రాంత ఎంపిటిసి షమీంతాజ్ తెలిపారు. ఎంపిపి రత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి షమీంతాజ్ మాట్లాడుతూ తూమకుంట చెక్‌పోస్టులో రోడ్డుకు అనుకుని బంకులు ఏర్పాటు చేసుకున్నారన్నారు. దీంతో రోడ్డు కుచించుకుపోయి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు.


సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎఇను నిలదీస్తున్న ఎంపిటిసి షమీం తాజ్

పంచాయితీ తరపున నోటీసులను ఇచ్చి ఖాళీ చేయమని చెప్పినా స్థలం ఆర్‌అండ్‌బికి చెందినదని, తాము ఖాళీ చేయమని వారు చెబుతున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. తూమకుంటకు చెందిన విద్యుత్ శాఖ లైన్‌మెన్ స్థానికంగా లేక పోవడంతో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే మరుసటి రోజు వరకు కరెంటు రాని పరిస్థితి ఉందన్నారు. లైన్‌మెన్ స్థానికంగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. అనంతరం అధికారులు వారి శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ నరేంద్ర కుమార్, జెడ్‌పిటిసి నాగభూషణం, ఈవోఆర్‌డి నటరాజ్‌తో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నామమాత్రపు హాజరు

సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నామ మాత్రంగానే హాజరయ్యారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ పంచాయితీలు ఉన్నాయి, మొత్తం 15 మంది ఎంపిటిసిలు, 14 మంది సర్పంచులతో పాటు ఆయా పంచాయితీల సెక్రెటరీలు, ఇతర మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంది. 15 మంది ఎంపిటిసిల్లో ఎంపిపి, వైస్ ఎంపిపితో కలిపి కేవలం 7 మంది మాత్రమే హాజరు అయ్యారు. 14 మంది సర్పంచులకు గానూ కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఇటీవల జరిగిన సర్పంచి ఉప ఎన్నికల్లో నూతనంగా గెలిచిన సర్పంచి విందు ఏర్పాటు చేయడంతో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అందరూ అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. మండల సర్వసభ్య సమావేశంలో గ్రామంలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారంపై మాట్లాడాల్సింది పోయి ఇలా విందు భోజనాలకు సర్పంచులు, ఎంపిటిసిలు వెళ్లడంపై ఆయా గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మరోమారు వైసిపికి అండగా నిలవండి
వైసిపి ఇన్‌ఛార్జ్ దీపిక వేణురెడ్డి


ఐసిడిఎస్ స్టాల్‌ను పరిశీలన చేస్తున్న ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

గత టీడీపీ పాలనకు ప్రస్తుత పాలనకు తేడాను ప్రజలందరూ గమనించి మరోమారు వైసీపీకి అండగా నిలవాలని వైసిపి ఇన్‌ఛార్జ్ దీపిక వేణురెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు మండల పరిధిలోని బాలంపల్లి గ్రామంలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ మారుతీ రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పాలన గురించి ప్రజలకు వివరించారు. హిందూపురంలో ఎమ్మెల్యేగా గెలచిన బాలకృష్ణ ఏ ఒక్క రోజూ ప్రజల వద్దకొచ్చి వారి సమస్యలను తెలుసుకోలేదన్నారు. టిడిపి నేతలకు వైసిపి పాలకులు తెలుసుకోవాలన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాలంపల్లి పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రత్నమ్మ, వైసిపి నాయకురాలు మధుమతి రెడ్డి, సర్పంచి జయలక్ష్మి అశ్వర్థనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ రాము, జెసిఎస్ కన్వీనర్ గిరి, ఎంపిడిఒ నరేంద్రబాబు, వైస్ ఎంపిపి రఘునాథరెడ్డి, రామంజి, జెడ్పీటీసీ నాగభూషణప్ప, సర్పంచి నంజప్ప, శ్రీనివాస్ రెడ్డి, దేవరాజు, ఎంపిటిసిలు రామకష్ణారెడ్డి, కష్ణవేణి, సింగల్ విండో అధ్యక్షులు రంగనాథ్, నాయకులు బసవనపల్లి సుధాకర్ రెడ్డి, మల్లేష్, ఓబుల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రాజు, చంద్ర, నారాయణరెడ్డి, మలుగూరు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన : ఎమ్మెల్యే

అమరాపురం : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం ఆవరణంలో ఎంపీడీవో మునిస్వామి ఆధ్వర్యంలో రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సారక్క నరసింహమూర్తి, తహశీల్దార రమేష్ బాబు, జెసిఎస్ కన్వీనర్లు శ్రీనివాస్ రెడ్డి, ఆగళి శివన్న, గగనతన్వీర్ గౌడ్, మండల కన్వీనర్ త్రిలోక్నాథ్, ఈవోఆర్డీ నాగముని, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, పేలుబండ ప్రసాద్, ఆలదపల్లి సర్పంచి ఈరన్న, వైకాపా నాయకులు నారాయణ, డీలర్ శివన్న, పులికుంట మంజునాథ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

క్షయ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకుని దాని నిర్మూలనకు కృషి చేయాలని ఎంపిటిసి షమీంతాజ్ తెలిపారు. శుక్రవారం నాడు మండల పరదిలోని తూమకుంటలో వాసవ్య మహిళా మండలి కుశాల్ హెల్త్ కేర్ క్లీనిక్ విప్రో కేర్ సహకారంతో డ్వాక్రా సంఘ సమావేశంలో కుశల్ ఆరోగ్య కేంద్ర సిబ్బంది టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధిని గుర్తించి దానికి క్రమ పద్ధతిలో చికిత్సలు తీసుకుంటే నయం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై ఫిర్యాదు

అమరాపురం : మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామపంచాయతీ కార్యదర్శి ఈరన్న, అన్నపూర్ణ, విరుపాక్షిలపై స్థానిక వైసిపి నాయకుడు గడ్డం రాజు ఎమ్మెల్యే తిప్పేస్వామికి శుక్రవారం నాడు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్యదర్శులు ప్రజల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పరిశుభ్రత, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలపై మాట్లాడదామంటూ కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదన్నారు. ఏదైనా గ్రామ సమస్యను చెబితే పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్పందించి కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

నేలకొరిగిన వరిపంట పరిశీలన

ప్రజాశక్తి-నల్లచెరువు

ఇటీవల కురిసిన వర్షాలకు మండల పరిధిలోని నడింపల్లి, సుబ్బరాయునిపల్లి, తదితర గ్రామాల్లో వంద ఎకరాలకుపైగా వరి పంట నేలకొరిగింది. ఆ పంటలను శుక్రవారం రైతు సంఘం జిల్లా నాయకులు బడా సుబ్బి రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, తదితరులు పరిశీలించారు. బడా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనం తపురం జిల్లాలో రైతులు ఏటా అతివృష్టి, అనావృష్టి, తదితర కారణాల చేత పంటలు నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల చాలామంది రైతులు వేరుశనగ పంట సాగు చేయలేకయా రన్నారు. రబీలో వరి పంట సాగు చేయగా చేతికొచ్చే సమయంలో గాలివానలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయ న్నారు. ప్రభుత్వం, వ్యవసాయ


నేల కొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా నాయకులు బడా సుబ్బిరెడి, తదితరులు

అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట రైతులు మహదేవరెడ్డి, రమణారెడ్డి, బాబురెడ్డి, నరసింహారెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఆదినారాయణ, పురుషోత్తంరెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

మండల మీట్‌లో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-లేపాక్షి

గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యల నే పరిష్కరించలేనప్పుడు మళ్లీ సమావేశాలు నిర్వహించడం ఎందుకు, మళ్లీ సమస్యలను అడగడం ఎందుకని ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శు క్రవారం ఎంపిపి వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలుంటే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరగా సభ్యులు పైవిధంగా నిలదీశారు. వివేకానంద జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినుల పట్ల ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. మండల వ్యాప్తంగా రోడ్లు సరిగా లేవన్నారు. ప్రతి ఇంటికీ బాత్‌రూమ్ కట్టించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ సురేష్‌బాబు


మండల సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

తెలిపారు. తాగునీటి సమస్యను మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చూపుతామని ఎఇ రాధిక అన్నారు. పలు శాఖల్లోల సిబ్బంది కొరత ఉందని, వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపిడిఒ నరసింహనా యుడు, తహశీల్దార్ బాబు, జడ్పిటిసి శ్రీనివాసులు రెడ్డి, ఇఒఆర్‌డి శివన్న, ఎఇ వెంకటేశ్వర్లు, రాధిక, డాక్టర్లు చిరంజీవి, రాజకుమార్, కిషోర్, త్రిశూల్, మహేష్, ఎపిఒ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సైన్స్ అభివృద్ధికి మూలం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రశ్నే సైన్స్ అభివృద్ధికి మూలమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, హెచ్‌ఎం ఉమాపతి పేర్కొన్నారు. స్థానిక బిఎస్‌ఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వం అలవరచుకోవాలన్నారు. చంద్రయాన్-3 విజయవంతంతో ప్రపంచం గర్వించదగ్గ స్థాయికి భారత్ ఎదగడంలో సైన్స్, శాస్త్రవేత్తల పాత్ర వెలకట్టలేదనిదన్నారు. భారత్ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్ర దేశాల సరసన నిలిచినా చేతబడి, బాణామతి, తదితర మూఢనమ్మకాలు మాత్రం పోలేదన్నారు. సైన్స్ లేనిదే భూమి మీద మానవుని


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఆదిశేషు, ఉమాపతి

మనుగడ సాధ్యం కాదన్నారు. కావున ప్రతి పౌరుని లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, శివరత్న, పార్వతమ్మ, సుజాత, శ్రీలత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి -పెనుకొండ

ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయ వాది శివరామకృష్ణ పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యం లో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ పురవీధుల్లో శాంతిర్యాలీ నిర్వహించి దర్గా సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఎస్‌కెడి సర్కిల్, గాంధీ, తెలుగుతల్లి సర్కిళ్ల మీదుగా ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం చేరుకుని డిఎఒ రమణకు వినతి పత్రం సమర్పించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ దళితులపై దాడులు ఎక్కువయ్యాయని అరికట్టాలని డిమాండ్ చేశారు.


డిఎఒ రమణకు వినతి పత్రం ఇస్తున్న న్యాయవాది శివరామకృష్ణ

కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక నాయకులు రవికుమార్, వెంకటేష్, నరసింహ, సూరి, క్రిష్ట, ఈశ్వర్, రొద్దం బాబుప్రసాద్, నాగరాజు, నరేష్, అంజనప్ప, ప్రవీణ్, నాగలూరు శివ, కొల్లప్ప, మారుతీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల పరిధిలోని మల్లమీదపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చేసిన వాగ్దానాలన్నీ పూర్తి చేసిన ఏకైక సిఎం జగన్ అన్నారు. మల్లమీదపల్లి, తనకల్లు మండల పరిధిలోని రాసినపల్లి, కాట్నేపల్లి, ఎన్‌పి కుంట మండలంలోని మేకలచెరువు, ముడుపులజీవి గ్రామాల రైతులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు రూ. 2 కోట్లు ఖర్చు చేసి 9 నెలల్లోపే విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పూర్తి చేశామన్నారు. సబ్‌స్టేషన్‌కు అదే గ్రామానికి చెందిన ముబారక్ స్థలం ఇచ్చాడని అభినందించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిఇ మోసున్, ఎడి సుబ్రమణ్యం, కన్‌స్ట్రక్షన్ ఎడి మోహనమ్మ, ఎఇ


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

విశ్వనాథం, ఎంపిపి టి.జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, వైస్ ఎంపిపి భారతి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్‌అలీ, భాస్కర్‌రెడ్డి, సర్పంచులు సంఘం అధ్యక్షుడు బి.రవీంద్రనాయక్, సర్పంచులు కళావతి, ఎస్.రహంతుల్లా స్థల దాత ముబారక్, చలపతి, రైతులు తదితరులు పాల్గొన్నారు

బ్రాహ్మణులపై జూపూడి అనుచిత వ్యాఖ్యలు తగదు

మడకశిర : వైసిపి నాయకుడు జూపూడి ప్రభాకర్‌రావు బ్రాహ్మణులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ గురుమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. వేదికపై ఉన్న వైసిపి పెద్దలు జూపూడి వ్యాఖ్యలను ఖండించకపోవడం దారుణమన్నారు. జూపూడి వెంటనే బ్రాహ్మణ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ సౌజన్యకుమారి ఆదేశించారు. మండల పరిధిలోని దర్శనమల, రావులచెరువు, ధర్మపురి సచివాలయాలను శుక్రవారం ఆమె సందర్శించారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై చర్చించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఫిర్యాదులు అందితే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధులను బాధ్యత, సేవా భావంతో నిర్వర్తించినప్పుడే సచివాలయాలకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించండి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య రైతులకు సూచించారు. మండల పరిధిలోని పోతుల నాగేపల్లి గ్రామంలో శుక్రవారం ఖరీఫ్-2023 పొలంబడికి సంబంధించిన క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాల ని, అప్పుడే తగిన ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎఒ ముస్తఫా, సర్పంచి, ఎంపిటిసి నర్సిరెడ్డి, వెంకటరామిరెడ్డి, పొలంబడి రైతు పోతిరెడ్డి, ఆర్‌బికె సిబ్బంది పూర్ణిమ, హాసిక, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో రూ. 12 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లకు సంబంధించిన పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే పార్టీ శ్రేణులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ 40 వార్డుల్లో బైక్ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శివారు ప్రాంత కాలనీలకు ప్రాధాన్యత ఇచ్చి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రతిపక్షాలకు పుట్టగతులు లేకనే నానా యాగి చేసి బురద జల్లాలని చూస్తున్నారన్నారు. ప్రజలు కుటిల రాజకీయాలు చేస్తున్న టిడిపి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి,


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

కమిషనర్ బండి శేషన్న, వైస్ ఛైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, వైసిపి పట్టణ అధ్యక్షులు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు స్థానిక కెజిబివి విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాగరత్న శుక్రవారం తెలిపారు. ఇటీవల అనంతపురం నగరంలోని ఆర్‌డిటి క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్-14 సాఫ్ట్ బాల్ పోటీల్లో అనిత(8వ తరగతి), పల్లవి(9), అనూష(10) ప్రతిభ చాటారన్నారు. వీరు ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిను లను ప్రిన్సిపల్‌తో పాటు పిడి రాధ, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులకు క్రీడలూ అవసరం

విద్యార్థులు జీవితాన్ని ఉన్నతంగా మార్చుకోవడానికి క్రీడలూ ఎంతో అవసరమని మండల పరిధిలోని తురకలాపట్నం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శివరాం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో రొద్దం, తురకలాపట్నం, లేపాక్షి, తనకల్లు మండలంలోని ఓబిరెడ్డిపల్లి జోన్ జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ పోటీలకు సాఫ్ట్‌బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర ముఖ్యఅతిథిగా హాజరవగా న్యాయ నిర్ణేతలుగా శివ, లక్ష్మీనారాయణ వ్యవహరించినట్లు తెలిపారు. పోటీల్లో రొద్దం జడ్పీ హెచ్‌ఎస్ విజేతగా నిలవగా, తురకలాపట్నం జడ్పీ హెచ్‌ఎస్ రన్నర్స్‌గా నిలిచాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు, పిడిలు శివకుమార్, కృష్ణవేణి, వెంకటేష్, రాధా, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పులమతి విద్యార్థిని

లేపాక్షి : మండల పరిధిలోని పులమతి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పావని జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్బారావు, పిడి రామాంజనేయులు తెలిపారు. పాఠశాలలో వారు మాట్లాడుతూ ఇటీవల ఎమ్మిగనూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అందులో పావని ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ జట్టు బీహార్‌లో



జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పంపికైన పావని

రొద్దం : రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కెజిబివి విద్యార్థినులు

డిసెంబర్‌లో జరిగే 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. పావని, శ్రీలత, పల్లవి, పిడిలను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ మంజునాథ్, గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుట్టపర్తి రూరల్ : ఇటీవల బుక్కపట్నంలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ఐ అండర్-17,19 షూటింగ్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 షూటింగ్ బాల్ పోటీల్లో జ్ఞానేంద్రసాయి, సిపి.ధనుశ్రీ, వరలక్ష్మి, అండర్-19లో సురేష్‌రైనా, గౌతమి, హరిణి ఎంపిక కాగా ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పిడి అజీమ్‌బాషా, అధ్యాపక బృందం అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి : టిడిపి

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మెల్యే తిప్పేస్వామి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజు నాథ్ హితవు పలికారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాజీ ఎమ్మెల్యే ఈరన్నని తొక్కేస్తున్నాంనడం తగదన్నారు. ఈరన్న ఎమ్మెల్యేగా అనర్హుడంటూ కోర్టు ద్వారా డిస్ క్వాలిఫై చేసినపుడు దళితజాతి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. దళిత ద్రోహి నీవే అన్నారు. ఈరన్నతో రహస్య వ్యాపారాలు చేసి టిడిపిలో అతనిని జీరోని చేసింది నీవు కాదా అన్నారు. గుడిబండ మండలంలోని కొంకల్లు, జి.మోరుబాగల్, ఎస్.రాయపురంలో పలువురు వాల్మీకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించింది నీవు కాదా అని ప్రశ్నించారు. డాక్టర్‌గా ఫీజుల రూపంలో రక్తం తాగింది, రైతుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వసూలు చేసింది, ఎమ్మెల్యేగా భూకబ్జాలకు పాల్పడింది, అంగన్వాడీ పోస్టులు, కెజిబివి,


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంజునాథ్

రెసిడెన్సియల్ స్కూళ్లలో సీట్లు, ఉద్యోగుల బదిలలు, తిరుమలలో దర్శనం కోసం సిఫార్సు లెటర్లు అమ్ముకున్నది వాస్తవం కాదా అని నిలదీశారు. మరోసారి నారా లోకేష్, గుండమల తిప్పేస్వామి గురించి తప్పుగా మాట్లాడితే నీ ఇంటిని ముట్టడించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కన్నా, నాగేష్, రమేష్, బుల్లెట్ శంకర్, రవి, మంజునాథ్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌టిసి డయల్ యువర్ డిఎం

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలపై శనివారం (నేడు) 'డయల్ యువర డిఎం' నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డిపో మేనేజర్ ఇనాయతుల్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 9959 225857 నెంబర్‌కు ఫోన్ చేసి అభిప్రాయాలు చెప్పాలని డిపో మేనేజర్ కోరారు.

ఆసుపత్రిలో గర్భిణులకు అన్నదానం

పెనుకొండ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం గర్భిణులు, వారి సహాయకులు, రోగులు, ఆరోగ్య సిబ్బందికి శ్రీసత్యసాయి సేవా సమితి నేతృత్వంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, లాయర్ నాగరాజు, సతీమణి లీలావత మ్మ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది శర్మ, నంజప్ప, సత్యసాయి సేవా సమితి అధ్యక్షులు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు రూరల్ : ఉచిత సామూహిక వివాహాలకు పర్తి ధర్మశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవా లని పుట్టపర్తికి చెందిన ప్రముఖ బిల్డర్ సాయికృష్ణ సూచించారు. ఈ నెల 17వ తేదీ శ్రీసత్యసాయి బాబా జయంతి సందర్భంగా మండల పరిధి లోని చెన్నకేశవపురం గ్రామంలోని చెన్నకేశవాలయంలో సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరుడుకి 21, వధువుకి 18 ఏళ్లు నిండి ఉండాలని, ఆధార్‌కార్డు తప్పనిసరి అన్నారు.

ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు

పెనుకొండ : పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ శ్రీనివాసులు, కరస్పాండెంట్ యు.మంజువాణి మాట్లాడుతూ దీపావళి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

నల్లచెరువు : మండల పరిధిలోని నడిమిపల్లి ఎస్సీ కాలనీలో శుక్రవారం వైసిపి కార్యకర్త రమణప్ప మృతి చెందాడు. అతడి అంత్యక్రియలకు వైసిపి యువ నేత పాల్యం సుధాకర్ రూ. 5వేలను తన మిత్రుల ద్వారా అందజేశారు. అతడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రొద్దం

గాలివానకు వరిపంట నష్టపోయిన రైతులను ఆదుకొంటామని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. మండల పరిధిలోని కలిపి పంచాయతీలో నాలుగు రోజుల క్రితం వీచిన గాలివానకు 390 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిండి. ఆయా పంటలను శుక్రవారం ఎమ్మెల్యే రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి పంట క్రాప్ బుకింగ్ సమగ్రంగా చేసి నివేదికను పై అధికారులకు పంపాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి చంద్రశేఖర్, వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, నాయకులు రాజారెడ్డి, మారుతిరెడ్డి, కలిపి సర్పంచి శివకుమార్ ఉన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గ్రామాల్లో కాంగ్రెస్ 'ముందడుగు'

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఒక అవకాశం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ కోరారు. 'ముందడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రొళ్ల మండల పరిధిలోని కాకి, కె.బాడిగెర, అక్కేపల్లి గ్రామాల్లో పర్యటించి పార్టీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, కావున ఓ అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని వివరించారు. ప్రతి గ్రామంలో నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు. మండల కన్వీనర్ ఎస్.గౌడప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ముందడుగు కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్

ఫైరింగ్ రేంజ్ పనుల పరిశీలన

పుట్టపర్తి రూరల్ : బుక్కపట్నం-ముదిగుబ్బ ప్రధాన రహదారిలో బుచ్చయ్యగారిపల్లి గ్రామ సమీపంలో పోలీస్ శాఖకు చెందిన స్థలంలో జరుగుతున్న పనులను శుక్రవారం ఎస్పీ మాధవ్‌రెడ్డి పరిశీలించారు. పనులను నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎఆర్ అడ్మిన్ ఆర్‌లు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు నరసింహులు, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల దుకాణాల వద్ద నిబంధనలు తప్పనిసరి

పుట్టపర్తి రూరల్ : మండలంలో టపాసుల దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని తహశీల్దార్ నవీన్‌కుమార్ హెచ్చరించారు. టపాసుల దుకాణదారులతో శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఫైర్ ఆఫీసర్ నాగరాజునాయక్, రూరల్ ఎస్ఐ పి.కృష్ణమూర్తి, అర్బన్ ఎస్ఐ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు సూచించిన చోటే దుకాణాలు నిర్వహించాలన్నారు. సంబంధిత జిల్లా అధికారుల నుంచి లైసెన్స్ పొందిన వారు మాత్రమే దుకాణాలు నిర్వహించాలన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొత్తచెరువు : ఇటీవల మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో కార్తీక్ అనారోగ్యంతో, పాతదేవరపల్లి గ్రామంలో గంగాధర్ పిడుగుపాటుకు గురై మృతి చెందారు. దీంతో జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ సంఘం నాయకులతో కలిసి శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కురుబ సంఘం తరపున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జనంంంరల్ సెక్రటరీ బన్నెల రమేష్, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, శ్రీనివాసులు, పాల్గొన్నారు.


మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సామకోటి

నేరాలు ఘోరాలు

వరకట్న వేధింపుల కేసులో జైలు, జరిమానా

కదిరి టౌన్ : పట్టణంలోని కుటాగుళ్ల బెస్తవారివీధికి చెందిన డి.రేవతి ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు కుటుంబ సభ్యులపై గతంలో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. రేవతి తన భర్త డి.గంగరాజు, మరిది రమణ, అత్త చెన్నమ్మ, మామ చిన్న గంగన్నలపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అబ్దుల్ రెహ్మాన్ కదిరి పట్టణ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దానిపై దర్యాప్తు చేసి ఎస్ఐ నిరంజనరెడ్డి ఛార్జిషీట్ వేశారు. ఈ కేసులో అన్ని సాక్ష్యాలను పరిశీలించిన కదిరి అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం గంగరాజు, రమణలకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు ఒకొక్కరికి రూ. 1000 జరిమానా విధించింది. మిగిలిన ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గోరంట్ల రూరల్ : అక్రమంగా రవాణా చేస్తున్న 26 క్వింటాళ్ల(140 బ్యాగులు) పిడిఎస్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ అధికారులు మండల పరిధిలోని కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి ఒడిసి మండలం మల్లాపల్లికి చెందిన శిరగం హరినాథ్‌రెడ్డి, కదిరి నరేష్(డ్రైవర్)లపై గోరంట్ల స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో సిఐ వి.వెంకటరమణ, ఎస్ఐ పి.ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఎఇఇలు టి.రాజశేఖర్, ఎల్.రవీంద్రనాథ్, సిఎస్‌డిటి కె.రాజా, ఆర్ఐ ఎస్.సోమశేఖర్‌రెడ్డి, విఆర్ఒ మన్సూర్‌బాషా పాల్గొన్నారు. రేషన్ బియ్యాన్ని గోరంట్ల పౌరసరఫరాల గోదాములో అప్పగించారు.


నాసా కాన్సెప్ట్‌కు ఎంపికైన 'నారాయణ' విద్యార్థులు

నాసా కాన్సెప్ట్‌కు 'నారాయణ' విద్యార్థులు

కొత్తచెరువు : స్థానిక నారాయణ పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు నాసా కాన్సెప్ట్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారని ఎజిఎం రమేష్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు స్పేస్ క్యాటగిరీ, స్పేస్ మీనింగ్, ఈ ప్రాజెక్టులను త్వరలో ప్రదర్శిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు నాసా పుస్తకాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులను ఎజిఎంతో పాటు కోఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్, ప్రిన్సిపల్ గురుప్రసాద్, అకాడమీ డీన్ విశ్వనాథ్, ఎఒ రామ్మూర్తి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

నారాయణ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలను డీన్ రమేష్‌బాబు, సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సర్ఫరాజ్‌ఖాన్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడి, సత్యభామ, నరకాసురుడి వేషధారణలో అలరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమా ల ద్వారా పండుగ విశిష్టతను తెలియజేసేలా విద్యను బోధిస్తున్నామని తెలిపారు. అనంతరం శ్రీకృష్ణ, సత్యభామ, నరకాసురుడి వేషధారణలో అలరించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారికి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నారాయణ పాఠశాల అకడమిక్ డీన్ జి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎఒ జక్రియ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రెడ్డి హరిత, ఈ కిడ్స్ రాసినేని హరిత, ఈ చాంప్స్ నియామత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని పాత్రికేయుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక పాత్రికేయులు రామాంజనేయులు, లక్ష్మీపతి ఎస్ఐ లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ అగళి మండల పరిధిలోని రావుడి గ్రామంలో వాలంటీర్ వేద తనకు జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేయగా వార్తలు రాసినందుకు ఎంపిపి భర్త కామరాజు, ఎంపిటిసి భర్త బసవరాజు ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రోద్బలంతో తమపై కుట్రలు చేసి అక్రమ కేసులు బనాయించాలని ప్రయత్నిస్తున్నారని వాపోయారు. వారి నుంచి తమకు, తమ కుటుంబాలకు రక్షణ కల్పించాలని సిఐ సురేష్ బాబు, ఎస్ఐ లోకేష్‌లకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు వినోద్‌కుమార్, విశ్వనాథ్‌రెడ్డి, హనుమంతు, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, కామరాజు, హరీష్, నరసింహామూర్తి, నగేష్, రామాంజనేయులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న నాగభూషణ్‌రెడ్డి

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

సోమందేపల్లి : స్థానిక దుర్గానగర్‌కు చెందిన 1వ సచివాలయంలో వాలంటీర్‌గా పని చేస్తున్న సుగుణ బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఈదులబలాపురం నాగభూషణ్‌రెడ్డి శుక్రవారం రూ. 10వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి కంటే నమ్మకం బలమైందని, నమ్మకంతో ముందుకెళ్లాలని ధైర్యం చెప్పారు.

విద్యార్థులకు చెకుముకి పరీక్షలు

ముదిగుబ్బ : మండల పరిధిలోని ప్రతి ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం చెకుముకి పరీక్ష నిర్వహించారు. అంతకుముందు స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి పరీక్ష ప్రశ్నపత్రాన్ని ప్రధానోపాధ్యాయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిదంబరరెడ్డి, నాగరాజు, వెంకటశివారెడ్డి, ఆదినారాయణరెడ్డి, చంద్రశేఖర్, మాధవీలత, వెంకటశివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఉదయం 9:30 గంటలకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు శనివారం(నేడు) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జయంతి రోజును ప్రభుత్వం జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖకు చెందిన అధికారులు తప్పక హాజరవ్వాలని కోరారు.

సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

పెనుకొండ : పట్టణంలోని ఎమ్మెల్యే శంకరనారాయణ క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం పాత్రికేయు లు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యేని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గీతారామ్మోహన్‌రెడ్డి, జడ్పిటిసి గుట్టూరు శ్రీరాములు, సింగిల్‌విండో అధ్యక్షులు సల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగలూరు బాబు, కౌన్సిలర్లు తయూబ్, రామాంజి, పాత్రికేయులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

బాల్యవివాహాలను అరికట్టాలని కోరుతూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో శ్రీశక్తి ప్రాజెక్ట్, ఆర్‌డిటి సంస్థ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. తల్లిదండ్రులకు బాలికల పెంపకం, బాల్యవివాహాలు, బాలికలకు చిన్న వయసులో వివాహం చేస్తే జరిగే నష్టాలు, బాలికలు తెలుసుకోవాల్సిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుంటే రెవెన్యూ, పోలీస్, 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. శ్రీశక్తి ప్రాజెక్టుకు సహకరిస్తున్న స్పెయిన్ బృందం కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో కల్చరల్ కోఆర్డినేటర్ శ్యామ్‌సన్, ఎటిఎల్ సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగుబ్బ : మరమ్మతుల నేపథ్యంలో మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ శివతేజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

ఆర్‌బికె పరిశీలన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల పరిధిలోని కురమామిడి సచివాలయం, ఆర్‌బికె కేంద్రం, తాళ్లకాల్వ అంగన్వాడీ సెంటర్‌ను శుక్రవారం ఎంపిడిఒ రామనాయక్ సందర్శించి హాజరు పట్టికలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బికెలో ఎరువులను సబ్సిడీ ధరకే రైతులకు అందజేయాలని ఆదేశించారు. తాళ్లకాల్వ అంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టి.ఓబుళమ్మ, మదన్‌మోహన్‌నాయక్, అగ్రికల్చర్ ఎఇఒ టి.పూజిత, వెల్ఫేర్ అసిస్టెంట్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని వెంకటగారిపల్లి, పైపల్లి పంచాయతీల్లో సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై శుక్రవారం వెంకటగారిపల్లి గ్రామ సచివాలయంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, వెంకటగారిపల్లి సర్పంచి లక్ష్మీదేవి, వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు తిరుపాల్‌నాయక్, మండల కన్వీనర్ నర్సారెడ్డి ప్రసంగించారు. తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోమారు జగన్ సిఎం కావాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లికార్జున, నరసింహారెడ్డి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సుయాత్రలో బత్తల

కదిరి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర అన్నమయ్య జిల్లా ములకలచెరువులో కొనసాగడంతో వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకటరమణ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్యం సుధాకర్, బహావుద్దీన్, జకీర్, పురుషోత్తంరెడ్డి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గుత్తి క్రీడాకారుడు

గుత్తి : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గుత్తి క్రీడాకారుడు ఎం.భువనేశ్వర్ ఎంపికయ్యాడు. అనంతపురంలోని ఆర్‌డిటి స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జిఎఫ్) అండర్-17 క్రికెట్ ఎంపికలో గుత్తిలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.భువనేశ్వర్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు. త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో భువనేశ్వర్ ఆడనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారున్ని పలువురు అభినందించారు.





బత్తలపల్లిలో కోటి సూర్యప్రకాష్ బాబు ఇంట్లో మంత్రి ఉషశ్రీచరణ్, తలుపులలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

'వై ఎపి నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

నియోజకవర్గంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం జరుగుతోందా ఎలా సాగుగుతోంది.. ప్రజల్లో స్పందన పై వైసిపి నాయకులను రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ ఆరా తీశారు. ఆమె శుక్రవారం అనంతపురం నుంచి తంబళ్లపల్లికి వెళ్తూ బత్తలపల్లిలో ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు ఇంటికి వచ్చారు. ముందుగా మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులను, కోటి సూర్యప్రకాష్ బాబు, జడ్పిటిసి కోటి సుధ దంపతులు సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం ఆమె పార్టీ నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. 'వై ఎపి నీడ్స్ జగన్'ను విజయవంతం చేయాలని సూచించారు. అంతకుముందు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ మంత్రికి స్వాగతం పలికారు. శాలువా కప్పి సన్మానించారు. తిరిగి వెళ్తున్న సమయంలో ఐసిడిఎస్ సిడిపిఒ సరస్వతి, అంగనాడీ వర్కర్లు పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కమతం ఈశ్వరయ్య, బండి వీరనారప్ప, పామల రమేష్, నడిమింటి షేక్షావలి, మిడతలు లక్ష్మీనారాయణ, కప్పల సుదర్శన్, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపనూ సందర్శించండి : ఎమ్మెల్యే

తలుపుల : 'వై ఎపి నీడ్స్ జగన్'లో భాగంగా గడప గడపనూ సందర్శించాలని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి సూచించారు. తలుపుల-1 గ్రామ సచివాలయం పరిధిలో చేపట్టిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తలుపుల-1 గ్రామ సచివాలయం పరిధిలోని 1100 కుటుంబాలకు సంక్షేమ పథకాల రూ. 28 కోట్లకు పైచిలుకు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. 830 పైచిలుకు పింఛనుదారులకు రూ. 3 కోట్లకు పైగా అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కదిరి టౌన్ : నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు అభివృద్ధి చేపట్టామని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కదిరి మున్సిపాలిటీ, కుట్టాగుళ్ల-2 వార్డులో నిర్వహించిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత సచివాలయంలో ఏర్పాటుచేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : మీ గ్రామంలోని లబ్ధిదారులను కలిసి వారికి సిఎం జగన్ చేసిన మేలును వివరించాలని కేతిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు సూచించారు. వారు బత్తలపల్లి-1, మాల్యవంతం, సంజీవపురం, ఈదుల ముష్టూరు, తంటాపురం గ్రామ సచివాలయాలను పరిశీలించారు. అనంతరం సర్పంచులు కమతం వరలక్ష్మి, చెడిపోతుల గోపాల్, సానే జయచంద్రారెడ్డి అధ్యక్షతన గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గజ్జెల వెంగురెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బయపురెడ్డి, కమతం ఈశ్వరయ్య, ముత్తూరు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : వైసిపి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిందని ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి రాధానాగరాజు తెలిపారు. 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా వైసిపి నాయకులు గురువారం రాత్రి స్థానిక 1వ సచివాలయం పరిధిలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం సచివాలయం వద్ద వైసిపి జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు వాల్మీకి శంకర్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు షాజహాన్, ఎంపిటిసి లక్ష్మీదేవి, సోమశేఖర్‌రెడ్డి, అశోక్, కృష్ణమూర్తి, భాస్కర్, ప్రభావతి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు

సిఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

మడకశిర : సిఎం జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. రొళ్ల సచివాలయం-1 పరిధిలో చేపట్టిన 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో అనంతరాజు, వైసిపి మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



రొళ్ల సచివాలయం-1 పరిధిలో చేపట్టిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

యువకుడికి జీవిత ఖైదు

గుత్తి : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన రాములు చరణ్‌రాజుకు జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. సీఐ ఎం.వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. 2021 అక్టోబర్ 12న గుత్తి మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక ఆరుబయట ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రాములు చరణ్ రాజు చాక్లెట్ ఇస్తానని మాయమాటలు చెప్పి బాలికను ఇంటి వెనక ఉన్న పత్తి చేనులోకి తీసుకెళ్లాడు. అక్కడ బాలికను అత్యాచారం చేస్తుండగా కేకలు పెట్టింది. అటు వైపున వెళ్తున్న గ్రామస్తులు పరిగెత్తి వెళ్లడంతో రాములు చరణ్‌రాజు పారిపోయాడు. ప్రత్యక్ష సాక్షులు ఆ పాపను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించి జరిగిన విషయం తెలిపారు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గుత్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి తాడిపత్రి డీఎస్పీ కృష్ణ చైతన్య కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజలక్ష్మి 11 మంది సాక్షులను విచారించి ముద్దాయి అయిన రాములు చరణ్ రాజుకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే బాధితురాలికి రూ. 5 లక్షలు పరిహారం చెల్లించేలా తీర్పు ఇచ్చారు.

టమోటా బాక్సులకు నిప్పు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో టమోటా బాక్సులు కాల్చివేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కొండాపురం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు తన వ్యవసాయ పొలంలో టమోటా సాగు చేశారు. ఈనేపథ్యంలో టమోటా పంటను పీకేందుకు గురువారం రాత్రి 200 బాక్సులను తోటలో సిద్ధంగా ఉంచాడు. అయితే శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బాక్సులను కాల్చివేశారన్నారు. ఈప్రమాదంలో టమోటా బాక్సులతో పాటు మోటారు వైరు, పైపులు కూడా కాలిపోయాయన్నారు. దీంతో సుమారు రూ.లక్ష వరకూ నష్టం సంభవించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ చైతన్య ఎటిపి-8లో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డు శ్రీచైతన్య ఏటీపీ-8 బ్రాంచిలో ముందస్తు దీపావళి సంబరాలను శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై దీపావళి పండుగ గురించి అనేక విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. దీపావళి అంటే దీపోత్సవం అన్నారు. అమావాస్య చీకట్లను పారద్రోలి జగత్తును తేజోవంతం చేస్తుందన్నారు. శ్రీకష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుని వధించడం అనంతరం ప్రజలు ఆనందంతో దీపావళి సంబరం చేసుకుంటారనే కథను ఆయన పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నేత్రావతి డీన్ అరుణ్‌కిరణ్, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి గంగాధర్, కోఆర్డినేటర్ తిరుమలేశ్వర్, ప్రైమరీ ఇన్‌ఛార్జి దేవకృప ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి రషీదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి ముందస్తు దీపావళి వేడుకలను చేసుకుంటున్న ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నేత్రావతి తదితరులు